క్లుప్తంగా

ఆశ్రమ అభివృద్ధికి విరాళం



ఆశ్రమం వద్ద ధర్మస్థల యోజన అధికారులు

పావగడ: తాలూకాలోని వైఎస్ హొసకోటలో రుద్రముని సేవాశ్రమ జీర్ణోద్ధరణకు స్థానిక శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామాభివృద్ధి యోజన అధికారులు చొరవ తీసుకున్నారు. ఆశ్రమ పీఠాధ్యక్షుడు లోకేశ్ స్వామి, గౌరవాధ్యక్షురాలు సరోజమ్మకు మంగళవారం రూ.2 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ధర్మస్థల యోజన డైరెక్టర్ ప్రవీణ్, తాలూకా యోజనాధికారి మహేశ్, జన జాగృతి వేదిక సభ్యుడు ఎస్ఆర్ అశ్వథ్ కుమార్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

రీ సర్వే -2 సమర్థవంతంగా చేపట్టండి

పెనుకొండ: రీ సర్వే–2 సమర్థవంతంగా నిర్వహించడానికి సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారంపట్టణంలోని భువన విజయం సమావేశపు భవనంలో రీసర్వే–2కు సంబంధించి రెవిన్యూ డివిజన్‌లోని తహసీల్దార్‌లు, రీసర్వే డీటీలు, మండల సర్వేయర్‌లు, వీఆర్‌ఓలతో పాటు గ్రామ సర్వేయర్‌లతో ఆర్డీఓ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన రీసర్వేతో పాటు రెండో విడత రీ సర్వేలో చేపట్టాల్సిన విషయాలను ఆయన వివరించారు. రీసర్వే–2 సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

నేడు పాలిసెట్



పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

హిందూపురం టౌన్: పట్టణంలో పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ హరీష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు 10 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. హిందూపురంలో ఏర్పాటు చేసిన ఐదు సెంటర్లలో 1,797 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హరేసముద్రంలో నాకాబందీ

మడకశిరరూరల్: మండలంలోని హరేసముద్రం గ్రామంలో మంగళవారం సీఐ నగేష్ బాబు ఆధ్వర్యంలో సిబ్బంది నాకాబందీ నిర్వహించారు. గ్రామంలో ఇళ్లు, వివిధ ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టారు. అసాంఘిక కార్యకలాపాలు, బాల్య వివాహాలు, సహజ మరణాలు తదితర వాటిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు.

గొల్లపల్లిలో బోనాల జాతర



గొల్లపల్లి గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి వెళ్తున్న చరణ్‌రెడ్డి

పెనుకొండ: మండలంలోని గొల్లపల్లిలో మంగళవారం బోనాల జాతర జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, కనీ్వనర్లు సుధాకరరెడ్డి, బోయ నరసింహాతో కలిసి గ్రామంలోని పలువురి ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఆప్యాయంగా పలకరించారు.

నేడు విద్యుత్ అంతరాయం

గోరంట్ల: మండలంలోని బూదిలి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ బాలకృష్ణానాయక్ తెలిపారు. బూదిలి సబ్‌స్టేషన్ లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కార్యవర్గం ఎన్నిక

మడకశిర: ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక మడకశిర నియోజకవర్గ కార్యవర్గాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా రేకులకుంట హనుమంతరాయుడు, ప్రధాన కార్యదర్శిగా కన్యాకుమారి, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, గంగాధర్ బాబు, అంజలి, కోశాధికారిగా వాసిమ్‌బేగ్, కార్యదర్శులుగా శివకుమార్, ఉమేష్, సలహాదారుడిగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశ్వత్థనారాయణ ఎంపికైనట్లు వేదిక ప్రతినిధులు తెలిపారు.

పైరుకు జీవం..రైతుకు ధైర్యం

- పొలాల్లో మంద (జీవాలు) తోలించడానికి రైతుల ఆసక్తి
- గొర్రెలు, మేకల ఎరువుతో భూసారం పెంపు



పెద్దగువ్వలపల్లి వద్ద పొలాల్లో గొర్రెల మంద



నారనాగేపల్లి వద్ద పొలంలో గొర్రెల మంద

రొద్దం: ఏటేటా వ్యవసాయం చేయడం భారమవుతోంది. ఎరువుల ధరలు పెరుగుతున్నాయి. పెట్టుబడి ఖర్చులు రెట్టింపవుతున్నాయి. దీంతో రైతులు ప్రత్యామ్నాయంగా పాత కాలం పద్ధతులను అవలంబిస్తున్నారు. రైతులు తక్కువ పెట్టుబడితో లభించే జీవాల ఎరువు వాడి పొలాల్లో భూసారం పెంచుతున్నారు. బీడు భూముల్లో గొర్రెలు, మేకల మందలను తోలించేందుకు ఆసక్తి చూపుతున్నారు. జీవాల ఎరువు పంట పొలాలకు వేస్తే పైరు ఏపుగా పెరగడంతోపాటు అధిక దిగుబడి పొందొచ్చు. ఆదిశగా రైతులు ఆలోచిస్తున్నారు.

రొద్దం మండలంలో రైతులు గొర్రెల మంద పొలాల్లో నిలిపి వాటి విసర్జితాలు నేలలో కలిసేలా చర్యలు తీసుకుంటారు. మేతకోసం ఇతర ప్రాంతాల నుంచి మండలానికి వచ్చిన గొర్రెల కాపర్లతో రైతులు మాట్లాడి వేసవి కాలం నెలల తరబడి మందలు వేయిస్తారు. వందల ఎకరాల్లో మందల కట్టడం ప్రస్తుతం జరుగుతోంది. ఇలా గొర్రెల మంద వేసిన వారికి డబ్బులు లేదా బియ్యం, కంది పప్పు, చింతపండు, కూరగాయలు ఇలా చేసుకున్న ఒప్పందం ప్రకారం వారికి ఇస్తారు. పొలాల్లో ఎక్కడ చూసినా జీవాల విసర్జితాల కోసం గొర్రెల మంద వేసుకుంటున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. తక్కువ పెట్టుబడితో లభించే జీవాల ఎరువు అటు భూసారం పెంచుతుంది. ఇటు పంటలు బాగా పండించుకునేందుకు దోహద పడుతుంది. దీంతో చాలా చోట్ల రైతులు గొర్రెల కాపర్లతో మాట్లాడి, మందలు నిలుపుకుంటున్నారు. వ్యవసాయాధికారులు కూడా జీవాల ఎరువు పైరుకు మేలు అని రైతులను ప్రోత్సహిస్తున్నారు.

ఏటా ఇదే విధానమే..

ఏటా పంటలు పండించిన తర్వాత గొర్రెల మందలు పొలాల్లో వేసుకుంటారు. అవి అప్పటికే పొలాల్లో మిగిలిన గడ్డి మొక్కలు తిని ఆ తర్వాత అవి వేసిన విసర్జితాలతో నేల సారవంతంగా మారుతుంది. గొర్రెలు, మేకలు వేసిన విసర్జితాలే ఎరువుగా ఉపయోగపడి ఆ తర్వాత పండించే పంటలకు అధిక దిగబడి ఇస్తాయి. ఈ గొర్రెల మంద విధానం అటు గొర్రెలు, మేకలకు ఇటు రైతాంగానికి కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

గొర్రెల మందలు మంచిదే



రైతులు వ్యవసాయ భూముల్లో గొర్రెల మందలు వేయించడం మంచిదే. గొర్రెల మందల వలన భూములకు న్యూట్రిసన్ కంటెంట్‌లో మంచిదే. తాము ఎఫ్ఐఎం (సేంద్రియ ఎరువులు) రెండేళ్లకు ఒకసారి భూములకు వేయాలని చెబుతుంటాం. అయితే ధర ఎక్కువగా ఉండంతో రైతులు గొర్రెల మందలు వేయిస్తారు.

– నివేదిత, ఏఓ, రొద్దం

ఆదరణ పెరిగింది



రైతులు ఇచ్చే డబ్బులు గిట్టుబాటు కాకపోయినా మంద వేస్తున్నాం. దూర ప్రాంతాల నుంచి వచ్చి రోజుల తరబడి నడుచుకుంటూ మందను తోడ్కొని వెళ్తాన్నాం. రాత్రిళ్లు అక్కడే వంట చేసుకుని ఉంటున్నాము. కష్టమైనా జీవాలకూ, తమకు పోషణ దొరుకుతుందని చేస్తున్నాం. ప్రస్తుత రోజుల్లో మందకు అయితే ఆదరణ పెరిగింది.

– రామన్న, గొర్రెల కాపరి, అచ్చంపల్లి, కర్ణాటక రాష్ట్రం

ఎరువుల ఖర్చు తగ్గుతుంది



పొలాల్లో గొర్రెల మందులు వేసుకోవడం ద్వారా పంటపొలాలకు ఎంతో మేలు జరుగుతుంది. ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు భూసారం పెరుగుతుంది. పంటలు కూడా బాగా పండుతాయి.

– రమేష్, నారనాగేపల్లి, రొద్దం మండలం

ఆలయానికి గ్రానైట్ వితరణ



ఆలయ కమిటీకి గ్రానైట్ వితరణ చేస్తున్న శబరీష్‌రెడ్డి

చిలమత్తూరు/హిందూపురం: హిందూపురం పట్టణంలోని 13వ వార్డు సడ్లపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు వార్డు ఇన్‌చార్జి సడ్లపల్లి శబరీష్ రెడ్డి గ్రానైట్ వితరణ చేశారు. మంగళవారం ఆయన రూ.1.38 లక్షలు వెచ్చించి గ్రానైట్ కొనుగోలు చేసి ఆలయ కమిటీకి అప్పజెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శివారెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, గోవిందరెడ్డి, ప్రణయ్‌రెడ్డి, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే రిటైర్డు టీచర్ శైలజాదేవి తమ తల్లి అంద్ర వెంకటమ్మ జ్ఞాపకార్థం రూ.51 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటేష్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సప్పలమ్మ విగ్రహ ప్రతిష్ట



సప్పలమ్మ దేవత

లేపాక్షి: మండలంలోని సి.వెంకటాపురంలో గ్రామ పెద్దలు, భక్తులు గ్రామదేవత సప్పలమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగాలు, మహామంగళారతి తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

కాలువలో పేరుకుపోయిన చెత్త తొలగింపు



చైతన్యనగర్‌లో పెద్ద కాలువలోని పూడిక చెత్తను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

హిందూపురం: పట్టణంలోని చైతన్యనగర్‌లోని పెద్ద కాలువలో పేరుకుపోయిన చెత్త, పూడికను మున్సిపల్ అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. సోమవారం సాక్షిదినపత్రికలో 'కాలువలో పేరుకుపోయిన చెత్త' అనే వార్త ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు మంగళవారం పెద్ద కాలువలో పేరుకు పోయి దుర్గంధం వెదజల్లుతున్న చెత్త, పూడికలను జేసీబీతో తొలగించారు.దీంతో కాలనీవాసులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

భార్యను చంపిన భర్తకు యావజ్జీవం

పావగడ: భార్యను మచ్చు కత్తితో నరికి చంపిన కేసులో భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ మధుగిరి కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలు.. 2019 మార్చి 23వ తేదీన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బాలాజీ తన భార్య కవితను పట్టణంలోని అతిథి గృహం వద్ద పట్టపగలే అందరూ చూస్తుండగానే మచ్చు కత్తితో నరికి చంపిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి పట్టణ సీఐ సి.వెంకటేష్ దర్యాప్తు జరిపి కోర్టుకు ఆధారాలు సమర్పించారు. కోర్టులో సుదీర్ఘ విచారణ అనంతరం నిందితుడి నేరం రుజువు అయ్యింది. ఐపీసీ 302 సెక్షన్ కింద న్యాయమూర్తి యాదవ కరకెరె తీర్పు వెలువరించారు. బాలాజీకి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధించారు. ప్రభుత్వం తరపున ఏపీపీ బీఏ నిరంజన మూర్తి వాదనలు వినిపించారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



సమస్యలు ప్రస్తావిస్తున్న సర్పంచ్ ముద్దరాజు

అగళి: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రేణుక అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం గంట సేపటికే ముగిసింది. ముందుగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చకచక చదివి వినిపించారు. వాటిపై పెద్దగా చర్చ జరగకపోవడంతో సమావేశాన్ని త్వరగా ముగించి మమ అనిపించారు. ఎంపీటీసీలు సంతకాలు చేసి సభ జరుగుతుండగానే వెళ్లిపోయారు. సభలో ఇద్దరు ముగ్గురు సభ్యులు మాత్రమే సమస్యలు ప్రస్తావించారు. ఉపాధి హామీ పనులపై టీఏ దేవగిరి ప్రగతి నివేదికను ప్రస్తవిస్తున్నపుడు.. సర్పంచ్ ముద్దరాజు సమస్యలు లేవనెత్తారు. హళ్లికేర పంచాయతీలో ఫారంఫండ్ పనులను కూలీలతో చేయించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫారంఫండ్ పనులను జేసీబీతో రాత్రిపూట చేయిస్తున్నారని తెలిపారు. రాత్రి పూట జేసీబీలతో పనులు చేసేటప్పుడు జరగరానిది జరిగితే నా పంచాయతీకి చెడ్డ పేరు వస్తుందన్నారు. అలా కాకుండా పగటి పూట పనులు చేయించాలని సూచించారు. టీఏ దేవగిరి ప్రగతి మాట్లాడుతూ.. అలాంటివి జరిగి ఉంటే మా దృష్టికి తీసుకురావాలని సమాధానం ఇచ్చారు. దానికి సర్పంచ్ ముద్దరాజు మాట్లాడుతూ.. వీడియాతో సహా మీకు పంపిస్తామన్నారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉమేష్, వైస్ ఎంపీపీ విమలమ్మ, ఎంపీటీసీలు మండల వ్యవసాయ అధికారి శేఖర్‌నాయక్, రెవెన్యూ అధికారి గుర్రన్న, ఎంఈఓ చంద్రశేఖర్, డాక్టర్ శివనంద తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలను తెలుసుకుంటున్న తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకి రామ్

పావగడ: తాలూకాలోని నిడుగల్ హోబళి కేటీహళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ముగదాళబెట్ట గ్రామానికి చెందిన గొల్లరహట్టిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకి రామ్ హామీ ఇచ్చారు. ఇటీవల గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. మంగళవారం అధికారులు గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులను అడిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ వరదరాజు మాట్లాడుతూ.. గొల్లరహట్టిలో నెలకొన్న సమస్యలను అతి త్వరలో పరిష్కరిస్తామన్నారు. సర్వే నంబర్ 166–1కు సంబంధించి 2 ఎకరాల 30 కుంట్ల భూమిని గుర్తించి చట్ట ప్రకారంగా సమస్యను పరిష్కరిస్తామన్నారు. తాలూకా పంచాయతీ సమితి ఈఓ జానకి రాం మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రెవెన్యూ శాఖ నుంచి గొల్లరహట్టిలో సర్వే నిర్వహించి లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందిస్తామన్నారు. గ్రామస్తుడు మారెప్ప మాట్లాడుతూ.. సుమారు 40 సంవత్సరాలుగా తాము ఇక్కడ నివసిస్తున్నామని తెలిపారు. అయితే పక్క భూమి యజమాని తమను ఇబ్బంది పెడుతున్నారని తెలిపాడు. ఎలాంటి శౌచాలయాలు, ఇళ్లు నిర్మించకుండా అడ్డు పడుతున్నాడని ఆరోపించాడు. ప్రభుత్వం అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పీడీఓ డీడీ మంజునాథ్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం



అమరాపురం: బసవనపల్లిలో మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుకొండ/సోమందేపల్లి/పరిగి/అమరాపురం/మడకశిర రూరల్: తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని సీడీపీఓ శాంతలక్ష్మి తెలిపారు. మంగళవారం పెనుకొండ పట్టణంలోని సీడీపీఓ కార్యాలయంలో కిశోరి వికాసం మండల లెవెల్ శిక్షణ కార్యక్రమం సీడీపీఓ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపీడీఓ భాగ్యరేఖ, మెడికల్ ఆఫీసర్ గంగాధర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సోమందేపల్లిలోని సాయి బాబా ఆలయంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఎంఈఓ ఆంజనేయులు నాయక్, సీడీపీఓ రాజేశ్వరి, సూపర్ వైజర్ శుభరాణి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పరిగిజ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగారాణి, రజిత , ఎంఈఓ శేషాచలం తదితరులు పాల్గొన్నారు. అలాగే అమరాపురం మండలంలోని బసవనపల్లి గ్రామంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ గంగరత్న, సూపర్‌వైజర్ కమలమ్మ, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. ముర్రుపాలతో పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఆరు నెలల వరకూ బిడ్డకు తల్లిపాలు తప్ప వేరే ఆహారం ఇవ్వకూడదని సూచించారు. అనంతరం పౌష్టికాహర ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసి గర్భవతులు, బాలింతలు ప్రజలకు అవగాహన కల్పించారు. బసవనపల్లి పంచాయతీ అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. అదేవిధంగా మడకశిర మండలంలోని మణూరు పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ అధ్వర్యంలో పోషణ పక్వాడా, బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శంకరమ్మ మాట్లాడుతూ.. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఐటీ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్

హిందూపురం: హిందూపురం సమీపంలో గుడ్డంపల్లి వద్ద ఉన్న బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్‌లో మంగళవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్ రంగంలో పనిచేసే శాస్మోస్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూ నిర్వహించి 15 మంది డిప్లొమా తృతీయ సంవత్సరం విద్యార్థులను ఎంపిక చేశారు. అలాగే 25 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులను ఇంటర్నెట్ షిప్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రమేష్ మాట్లాడుతూ తమ విద్యార్థులు ప్రతిభతో తగిన స్థానాలు సంపాదించుకున్నారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మే డే సభ జయప్రదం చేయండి

హిందూపురం: కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తూమకుంట కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో తూమకుంట వద్ద మేడే కార్యక్రమాలు జయప్రదం చేయాలని మంగళవారం కరపత్రాన్ని విడుదల కార్యక్రమం చేపట్టారు. మే 1న తూమకుంట పారిశ్రామిక వాడలో ఉదయం 10 గంటలకు ఎస్‌బీఐ బ్యాంక్ సర్కిల్ నుంచి చెక్‌పోస్టు వరకు పెద్దఎత్తున నిర్వహించే కార్మిక ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని రవికుమార్ కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పి బాబు, ప్రధాన కార్యదర్శి జి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రకు విద్యార్థులు



బస్సును ప్రారంభిస్తున్న ఎంఈఓలు గంగప్ప, శేషాచలం

హిందూపురం టౌన్: సమగ్ర శిక్ష ద్వారా హిందూపురం, మడకశిర నియోజకవర్గంలోని 50 మంది విద్యార్థులు మంగళవారం విహారయాత్రకు బయలుదేరారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సును హిందూపురం ఎంఈఓ గంగప్ప, పరిగి ఎంఈఓ శేషాచలం జెండా ఊపి ప్రారంభించారు. విహారయాత్ర ద్వారా బెంగళూరులోని విశ్వేశ్వరయ్య మ్యూజియం, ఈషా ఫౌండేషన్, అక్వేరియం, జంతు ప్రదర్శనశాల తదితర వాటిని సందర్శిస్తారని ఎంఈఓలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, సూర్యనారాయణ, చలపతి, పావని, జగదీష్, నాగేంద్ర, సత్యవాణి, విష్ణు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి వద్ద కారు ఢీ కొని సంజీవమ్మ అనే మహిళ గాయపడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. సోమందేపల్లిలోని వినాయక నగర్‌కు చెందిన సంజీవమ్మ ఈత కాయల కోసం అటవీ ప్రాం


సంక్షిప్త సమాచారం

తానికి వెళ్లి ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటే క్రమంలో బెంగళూరు వైపు వెళ్లే కారు ఢీ కొంది. ప్రమాదంలో ఆమె కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'వేసవి బడి' సద్వినియోగం చేసుకోవాలి

హిందూపురం టౌన్: పట్టణంలోని త్యాగరాజనగర్‌లో ఉన్న మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో మే 1 నుంచి జూన్ 1 వరకూ నిర్వహించే ఉచిత వేసవి బడిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సువర్ణ భారతీ జూనియర్ కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రిన్సిపాల్ నీలకంఠరెడ్డి సూచించారు మంగళవారం పాఠశాలలో ప్రచార పుస్తకాలను నీలకంఠారెడ్డితో పాటు ఏఓ అనిల్‌కుమార్ ఆవిష్కరించారు. వారు మట్లాడుతూ దాతల సహకారంతో 27 సంవత్సరాల నుంచి సాయికళ, మాళప్ప దంపతులు వేసవి బడి నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ సంవత్సరం దాతలు అరుణ, సీవీ నాగరాజు సౌజన్యంతో నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆధ్యాపకులు వెంకట్, జనార్ధన్, అరుణ, అభిలాష, అకౌంటెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాకుంభ సంప్రోక్షణ పూజలు



నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

రొళ్ల: కొత్తపాళ్యం (కొత్త తిరుపతి) గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం మహాకుంభ సంప్రోక్షణ పూజలు వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, కర్ణాటక రాష్ట్రం శిర తాలూకా ఎమ్మెల్యే టీబీ జయచంద్ర ముఖ్య నేతలు హాజరయ్యారు. శ్రీదేవి, గోదాదేవి సమేతంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గోవిందరాజు హాజరైన నాయకులను సన్మానించారు. హాజరైన భక్తులకు కమిటీ ద్వారా అన్నదానం చేశారు.

వడ్డీ కట్టించుకొని రీషెడ్యూల్ చేయాలి

పెనుకొండ: రైతుల పంట రుణాలను వడ్డీ మాత్రమే కట్టించుకుని రీషెడ్యూల్ చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు హరి, లక్ష్మీనరసప్ప, గంగాధర్, బాబావలి, తిప్పన్న, మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

గోరంట్ల: మండలంలో మంగళవారం రాత్రి రెండు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. మండలంలోని పట్లకుంటపల్లికి చెందిన స్టోర్ డీలర్ చంద్రశేఖర్ సొంత గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై గోరంట్లకు వెళ్తుండగా తిప్పారాజుపల్లి సమీపంలో వాహనం అదుపు తప్పి కిందపడి గాయపడ్డాడు. అతన్ని స్థానికులు చికిత్స నిమిత్తం గోరంట్ల ఆస్పత్రికి తీసుకెళ్లారు. స్థానిక ఎస్ఏపీఎస్ జూనియర్ కళాశాలలో వాచ్‌మెన్ అంజినప్ప రోడ్డుపై నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనింది. ఈ ప్రమాదంలో అంజినప్ప తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని 108 వాహనంలో గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదాలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మడకశిరలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు

మడకశిర: పట్టణంలో మంగళవారం దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. డీహెచ్‌పీఎస్ నాయకులు హనుమంతు, రఘు అధ్యక్షతన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. పోరాటాలు చేసిన దళిత నాయకులకు సేవా అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ పీఠాధిపతి ఓంకార్‌స్వామి, ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దండువీరయ్య, ప్రొఫెసర్ డాక్టర్ లింగన్న, డాక్టర్ నాగరాజు, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్‌ఫరూఖ్‌ఖాన్, కర్ణాటక బీఎస్పీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, నియోజకవర్గంలోని వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, ఎమ్మార్పీస్ నాయకులు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాలి

పెనుకొండ: ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాలని సీపీఐ, ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. నాయకులు బాలస్వామి, రమేష్ మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో వందలాది గ్రామాలకు విద్య, వైద్యంతోపాటు అన్ని వర్గాల వారికి సేవలందిస్తోందన్నారు. అలాంటి సంస్థ ఖాతాలు నిలుపుదల చేయడం సరికాదన్నారు. నాయకులు నారాయణస్వామి, శ్రీకాంత్, గంగరాజు పాల్గొన్నారు.

రొళ్ల: ఆర్డీటీ సేవలు కొనసాగించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, గృహ నిర్మాణాలు, పొదుపు సంఘాలు, వికలాంగులకు, క్రీడలకు తదితర ఎన్నో రంగాల్లో ఆర్డీటీ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పేదల పెన్నిదిగా పేరుగాంచిన ఆర్డీటీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆర్డీటీ సెట్ పరీక్షను ఈ ఏడాది కూడా కొనసాగించాలని కోరారు.

మడకశిరరూరల్: కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేయాలని మడకశిర నియోజకవర్గ ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడు వసీమ్ బేగ్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డీటీ సంస్థ పేద ప్రజలు, విద్యార్థులకు అండగా నిలిచిందన్నారు. పేదల అభ్యున్నతి కోసం సంస్థ పని చేస్తోందని వెల్లడించారు. ఆర్డీటీ సంస్థ సేవలు సజావుగా జరిగేలా చూడాన్నారు.